విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమగోదావరి

ఓటరు జాబితా పగడ్బందీగా ఉండాలి

జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం: పెంటపాడు మండలం ముదునూరు గ్రామ సచివాలయం, తాడేపల్లి గూడెం పురపాలక సంఘం 32 వార్డు సచివాలయాలను సోమవారం జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆకస్మిక తనిఖీలు చేసారు. ఇందుకు సంబంధించిన రిజిస్టర్లను, కంప్యూటరు డేటాను జిల్లా కలెక్టరు పరిశీలించారు.

సోమవారం సాయంత్రానికి నూటికి నూరుశాతం పూర్తి చేసి నివేదిక అందచెయ్యాలని అధికారులను జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఓటరు జాబితాలో తమ పేర్లు తొలగించారని ఒక్క ఫిర్యాదు కూడా రాకూడదని, అందరు మెచ్చే విధంగా ఓటరు జాబితా ఉండాలన్నారు. ఎంత మందిని కొత్త ఓటర్లను చేర్చారు, ఎంతమంది ఓటర్లను డిలీట్ చేశారని ఆమె అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది ఓటర్లు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారని, 80 సంవత్సరములు పైబడిన ఓటర్లు ఎంత మంది ఉన్నా రని జిల్లా కలెక్టరు ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఎఇఆర్వో, జిల్లా హార్టికల్చరు అధికారి ఎ.దుర్గేష్ , తహశీల్దార్లు వై.దుర్గా కిషోర్, జివి శేషగిరి, పురపాలక సంఘం కమిషనరు డాక్టర్ ఎ. శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు 287 స్వీకరణ

విశాలాంధ్ర-ఏలూరు: జగనన్నకు చెబుదాం స్పందన అర్జీలను త్వరిత గతిన పరిష్కరించడమే కాకుండా పరిష్కార తీరు నాణ్యతతో ఉండాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం స్పందన అర్జీల స్వీకరణ పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి, డిఆర్ఓ ఎవిఎస్ఎస్ మూర్తి, డిఆర్డిఏ పిడి విజయరాజు, ఆర్డిఓ కె. పెంచల కిషోర్ లతో కలిసి అర్జీలు స్వీకరించారు. సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో 287 అర్జీలు స్వీకరించినట్లు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం స్పందన అర్జీల పరిష్కారం ప్రజలు సంతృప్తి చెందేలా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

- జిల్లా ఎస్పి డి. మేరీ ప్రశాంతి

విశాలాంధ్ర-ఏలూరు క్రైమ్: ఏలూరు జిల్లాలో పనిచేస్తూ అనారోగ్య కారణాల వలన మృతిచెందిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటామని జిల్లా ఎస్పి డి.మేరీ ప్రశాంతి భరోసా కల్పించారు.

అనారోగ్య కారణాల వలన మృతి చెందిన పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులతో సమావేశాన్ని సోమవారం స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పి అమర వీరుల పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ అమరవీరుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వపరంగా శాఖా పరంగా ఆర్థికపరమైన అంశాలలో ఇప్పటివరకు పోలీస్ డిపార్ట్మెంట్ తరపున అందిన ఆర్థిక పరమైన అంశాలను గురించి ప్రతి ఒక్కరిని పేరుపేరునా అడిగి తెలుసుకున్నారు. దివంగత పోలీస్ అధికారుల కుటుంబాలలో అర్హత కలిగిన పిల్లలకు కారుణ్య నియామకాలకు ఇప్పటివరకు తీసుకున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి శుక్రవారం సిబ్బంది సంక్షేమ దివాసును నిర్వహిస్తు న్నట్లు ఏదైనా సమస్యను ప్రతి శుక్రవారం జిల్లా ఎస్పిని నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ సి, ఎస్ టి డిఎస్ పి నున్న మురళీకృష్ణ, ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయం ఎ.ఓ బి.వి.ఎస్.ఆర్ కె నాయక్, పోలీస్ అధికారులు, అమర వీరుల పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ 4071, పి. శ్రీనివాసరావు అనారోగ్య కారణాలవల్ల జూన్ 30న మరణించగా వారి సతీమణి పి.జ్యోతికి రూ. 1లక్ష చెక్కును ఎస్పి అందజేశారు.

ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి వుండాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి వుండాలని భూక్యా గోపయ్య సక్రమ ఫౌండేషన్ ఛైర్మన్ భూక్యా వేణు గోపాల్ తెలిపారు. టి నరసాపురం పంచాయతీ లోని కృష్ణాపురం గ్రామంలో భూక్యా సక్రమ ఫౌండేషన్ ఆధ్వ

ర్యంలో వృద్ధులకు సోమవారం కూరగాయలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వేణు గోపాల్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ తమ ఫౌండేషన్ ద్వారా సహ కారం అందిస్తామని ఆయన తెలిపారు. సక్రమ ఫౌండేషన్ ద్వారా త్వరలో మహిళలకు ఉచిత కుట్టు మిషను శిక్షణా కార్యక్రమం చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జరబల చందు భూక్యా కృష్ణ, కుంజ కిరణ్, భూక్యా శ్రీనివాస్, ధరావత్ గోపాలకృష్ణ, పండు,వీర భద్రుడు, భూక్యా సత్తిబాబు, ధరావత్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు కేసులు బనాయించడం అమానుషం

విశాలాంధ్ర-ఉండి: గ్రామాన్ని శాంతి యుత మార్గంలో నడిపేందుకు ప్రయత్నిస్తుంటే నా మీదే తప్పుడు కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసం అని ఆ గ్రామ సర్పంచ్ దాసరి వెంకట కృష్ణ అన్నారు. ఉండి మండలం వాంద్రం గ్రామంలో గత

నాలుగు రోజులుగా జరుగుతున్న వివాదాలు రోజురోజుకు తారస్థాయి చేరుకున్న ఈ సందర్భంగా ఆ గ్రామ సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ మాట్లాడుతూ ఇటీవల కాలంలో శ్రావణమాస సోమవారం జాతర మహోత్సవం సందర్భంగా గ్రామంలో రెండు వర్గాల మధ్య జరిగిన వివాదాలను సద్దుమణిగించే విధంగా శాంతియుతంగా రాజీ చేసే ప్రయత్నంలో ఉన్న తనపై రాజకీయంగా ఎదుర్కోలేని కొంతమంది వ్యక్తులు తప్పుడు కేసులు బనాయించడం బాధాకరమ న్నారు. గ్రామంలో జరుగుతున్న వివాదాన్ని పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా విచారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమ లేఅవుట్‌పై చర్యలేవంటూ ప్రజల ఆరోపణ

విశాలాంధ్ర - లింగపాలెం : మండల కేంద్రమైన లింగపాలెంలోని సీతమ్మ చెరువు సమీపంలో ఆరు ఎకరాలలో ఓ ప్రైవేటు వ్యక్తి అక్రమంగా వేసిన లేఅవుట్, దీనికి అక్రమంగా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారని పంచాయతీ నుంచే ఫిర్యాదులు వెళ్ళినా అధికారులు చర్యలు తీసుకోకపోవటం చర్చనీయాంశంగా మారింది. ప్రైవేటు వ్యక్తులు లేఅవుట్‌లు వేయాలంటే పంచాయతీ అనుమతి పొందాలి. నిబంధనల ప్రకారం పంచాయతీకి కొంత స్థలం కేటాయించాలి. ఈ లేఅవుట్‌లలో విద్యుత్ సౌకర్యం కల్పించటానికి పంచాయతీ అంగీకారం తెలపాలి. ఇటువంటి అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వానికి, పంచాయతీకి రావాల్సిన ఆదాయం రాకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారే ఆరోపణలు ఉన్నాయి. కొందరు దళారీల ప్రమేయంతో అక్రమాలు జరుగుతున్నాయని ఉద్యోగ వర్గాల నుంచి విమర్శలు వస్తున్నాయి. లేఅవుట్‌లలో రహదారులు, డ్రైయిన్లతో పాటు పలు సౌకర్యాలు ఉండాలి. అటువంటివేవీ నిబంధనలకు అనుగుణంగా లేవనే ఆరోపణలు ఉన్నాయి. మండల స్థాయి అధికారులు ఈ లేఅవుట్ ముందు నుంచే నిత్యం రాకపోకలు సాగిస్తున్నా ఇదేంటని ప్రశ్నించేవారే కరువయ్యారంటూ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఎంఈవోల రగడ

- చిచ్చురేపుతున్న నూతన విధానం
- తలలు పట్టుకుంటున్న డీఈవోలు

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: జిల్లా విద్యాశాఖలో రగడ రాజు కుంటోంది. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన రెండో ఎంఈఓ నియమాక వ్యవహారం మండలాలలో అధికారుల మధ్య చిచ్చు పెడుతోంది. ఇంతకాలం ఒక్కో మండలానికి ఒక్కో ఎంఈవో ఉండగా జగన్ సర్కారు కొత్తగా వీరిని కాదని రెండో ఎంఈవో విధానాన్ని అమలులోకి తెచ్చింది. ఒకరికి ఉపాధ్యాయుల పర్యవేక్షణ, జీతాల బిల్లులు పని అప్పగించగా, రెండో ఎంఈవో లకు పాఠశాలల తనిఖీ, పర్యవేక్షణ తదితర విధులు కట్టబెట్టింది. ఇప్పుడు ఈ పని విభజన ఇద్దరు ఎంఈవోల మధ్య చిచ్చు పెడుతోంది. ఇంతకాలం అన్ని పనులు కూడా పర్యవేక్షించిన పాత ఎంఈవోలు రెండో కొత్త ఎంఈవోలకు వీటిని వదిలిపెట్టకుండా ఇంకా పెత్తనం చలాయించడం గొడవలకు ఆజ్యం పోస్తోంది. ఎంఈవో కార్యాలయాలలో కుర్చీ మొదలుకొని గౌరవ మర్యాదల వ్యవహారంలో తమను చిన్న చూపు చూస్తుండడంపై మొదటి, రెండవ ఎంఈవోల మధ్య పంచాయతీ పెరుగుతోంది. పలు మండలాలలో కొత్త ఎంఈవోలు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కాగా, మొదటి ఎంఈవోలు జూనియర్ లు, ఇంకొన్ని మండలాల్లో దీనికి రివర్స్ ఉండటంతో వీరిద్దరి మధ్య తరచూ గొడవలు రాజుకుంటున్నాయి. ఏ మండలంలో చూసినా వీరిద్దరి నడుమ విభేదాలు బయటపడు తున్నాయి. గతంలో పాఠశాల విద్యాశాఖకు సంబం ధించి ప్రతి జిల్లాలోనూ డీఈవో పరిధిలో ఒక్కో మండలానికి ఒక్కో మండల విద్యాశాఖ అధికారి పనిచేస్తున్నారు. ఎన్నో ఏళ్ళుగా సాగుతున్న ఈ విధానంలో ఆయా మండలాల పరిధిలో ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ, ఉపాధ్యాయుల జీతభత్యాల బిల్లులు, తనిఖీలు అన్ని ఎంఈవో ఒక్కరే పర్యవేక్షించేవారు.

విద్యాశాఖపై భారం : జగన్ సర్కారు అధికారం చేపట్టిన తర్వాత విద్యాశాఖపై మరింత భారం పెరిగింది. విద్యార్థుల మెనూ దగ్గర నుంచి వారికి ఇచ్చే అమ్మ ఒడి, పాఠశాల విద్యా కానుక, మధ్యాహ్న భోజనం ఇలా రకరకాల పథకాల అమలుకు సంబంధించి ఏరోజుకారోజు ట్యాబ్‌లో ప్రభుత్వానికి ప్రధానోపాధ్యాయుల దగ్గర నుంచి ఎంఈవోల వరకు సమాచారం పంపించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పని ఒత్తిడి పెరగడంతో కొన్ని నెలల క్రిందట ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వంపై తిరగబడ్డాయి. పిఆర్‌సితో పాటు రకరకాల పాత బకాయిలకు సంబంధించి ఉద్యమానికి దిగాయి. అప్పటినుంచి విద్యాశాఖపై కక్ష పెంచుకున్న జగన్ సర్కారు రకరకాల వేధింపులు మొదలుపెట్టింది. ఉపాధ్యాయులకు ఇటీవల సమయానికి డిజిటల్ హాజరు తప్పనిసరి చేసింది. ఇప్పుడు ఉన్న ఎంఈవోల స్థానంలో కొత్తగా రెండో ఎంఈవోల విధానాన్ని ప్రవేశపెట్టి జూన్ నుంచి అమలులోకి తేవడంతో పాలనా పరంగా విభేదాలకు కారణం అయ్యింది.

అసంతృప్తితో ఎంఈవోలు : ఎంఈవో హోదా కావడంతో అనేకమంది సీనియర్ ప్రధానోపాధ్యాయులు రెండు నెలల కిందట ఈ బాధ్యతలు స్వీకరించారు. క్షేత్రస్థాయిలో పని విధానం ప్రారంభం అయ్యేసరికి ఎదురవుతున్న చిక్కులు, వివాదాలు, విభేదాలు, పంచాయతీలతో తలలు పట్టుకుంటున్నారు. ఈ పోస్టు మాకు వద్దు బాబోయ్ అంటూ పరుగులు తీస్తున్నారు. వాస్తవానికి రెండవ ఎంఈవోలను నియమించిన ప్రభుత్వం వీరికి కొత్తగా జాబ్ చార్ట్ ప్రకటించింది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చూడటం, పాఠశాలల తనిఖీ, డిజిటల్ బోధన వసతుల ఏర్పాటు, మధ్యాహ్న భోజనం అమలు, పాఠశాలల్లో శానిటేషన్ పర్యవేక్షణ, ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి రికార్డుల పర్యవేక్షణ తదితర విధులన్నీ వీరికి కట్టబెట్టింది. మండలం పరిధిలోని ఉపాధ్యాయులపై అజమాయిషీ జీతాల బిల్లులు, ఇతర సర్వీసు మేటర్స్ వంటి విధులు పాత ఎంఈవో లకు కేటాయించింది. పేరుకు పని విభజన జరిగినా క్షేత్రస్థాయిలో మాత్రం రెండవ ఎంఈవోలపై మొదటి ఎంఈవోల పెత్తనం చేస్తుండడంతో ఇప్పుడు కొత్త ఎంఈవోలు రగిలిపోతున్నారు.

ఇద్దరి ఎంఈవోల మధ్యన విభేదాలు : మండలాలలో ఏదైనా పాఠశాల తనిఖీకి కొత్త ఎంఈవోలు వెళితే పాత ఎంఈవోలు కొర్రీలు వేస్తున్నారు. మధ్యాహ్న భోజనం, పాఠశాలల శానిటేషన్ వ్యవహారాలలో జోక్యం అవసరం లేదంటూ వీరిని వెనక్కు లాగుతున్నారు. ఆఫీసులో కూర్చుంటే చాలని, తనిఖీలకు ఎవరి అనుమతి తీసుకున్నారంటూ ప్రశ్నిస్తుండడంతో ఇద్దరు ఎంఈవోల మధ్య ఇప్పుడు అనేక మండలాలలో భేదాభిప్రాయాలు తారాస్థాయికి వెళ్ళాయి. తమ విధులలో ఎందుకు జోక్యం చేసుకుంటున్నారు అంటూ ఆయా మండలాలలో ఎక్కడికక్కడ కొత్త ఎంఈవో లు పాత ఎంఈవోలు పేచీ పడుతున్నారు. మరికొన్ని మండలాలలో కొత్త ఎంఈవో లు అసలు మాట వినడం లేదని పాత ఎంఈవోలు రగిలిపోతు న్నారు. జిల్లా విద్యాశాఖ అధికారికి సైతం ఫిర్యాదు పంపు తున్నారు. మండలం నుంచి పంపిం చేయాలంటూ ఒత్తిళ్లు తెస్తున్నారు. మరికొందరైతే రాజకీయంగాను అధికార పార్టీ నేతల వద్దకు వెళుతూ రెండో ఎంఈవోను తప్పించే పని వారికి అప్పగిస్తు న్నారు.

సీనియర్లపై జూనియర్ల పెత్తనం : జిల్లాలో సగం వరకు మండలాలలో పాత ఎంఈవోలతో పోల్చితే కొత్త ఎంఈవో లలో అనేకమంది సీనియర్ ప్రధానోపాధ్యాయులే. వీరంతా గజిటెడ్ హోదా ఉన్నవారు. దీంతో జూనియర్ ఎంఈవో తమపై పెత్తనం చేయడం ఏమిటని కొత్త ఎంఈవోలు రగిలిపోతున్నారు. ఎంఈవో కార్యాలయాలలో కుర్చీ దగ్గర నుంచి ఛాంబర్ వరకు కొత్త ఎంఈవోలకు పెద్దగా ప్రాధాన్యం లేకుండా పాత ఎంఈవోలు చాలామంది చక్రం తిప్పారు. తమ ముందు రెండవ ఎంఈవోలు సబార్డినేట్లు అనే తీరులో వ్యవహరిస్తు న్నారు. రికార్డుల వర్క్ చేయాలంటూ పనులు చెబుతున్నారు. మేమెందుకు చేయాలి అంటూ వీళ్ళు ఎదురు తిరుగుతున్నారు. ఇక్కడ వీరిద్దరి మధ్య తగాదాలు ముదురుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని పలు మండలాలలో కొత్త ఎంఈవోలు పంచాయతీలు పెడుతున్నారు. అనేక విషయాలలో ఇద్దరు ఎంఈవోల మధ్య తరచూ బేదాభిప్రాయాలు నడుస్తుండడంతో ఏం చేయాలో తెలియక జిల్లా విద్యాశాఖ అధికారులు తలలు పట్టుకోవాల్సి వస్తోంది. ఈ తగాదాల నేపథ్యంలో తాము ఈ పోస్టులో ఉండలేము అంటూ పలువురు కొత్త ఎంఈవోలు పైఅధికారుల వద్దకు క్యూకడుతున్నారు. తమను తప్పించాలంటూ ఒత్తిడి తెస్తున్నారు.తీరా కొత్త ఎంఈవో కోసం చూస్తుంటే ఈ పంచాయతీలతో వేగలేక మిగిలిన వారు ఆ పోస్ట్ వైపు చూడడానికే సాహసించడం లేదు.

మహిళల్లో ప్రతిభను గుర్తించి గౌరవించాలి

- సినీ నటుడు ఆలీ సతీమణి జుబేదా

విశాలాంధ్ర - లింగపాలెం : మహిళల్లో ఉన్న ప్రతిభను, శక్తిని గుర్తించి గౌరవించినప్పుడు సమాజం బాగుంటుందని సినీ నటుడు ఆలీ సతీమణి జుబేదా అన్నారు. లింగపాలెం మండలంలోని శింగగూడెంలో ఉన్న సొంత వ్యవసాయ క్షేత్రానికి వచ్చారు. ఈ సందర్భంగా విశాలాంధ్రతో ముచ్చటించారు. తాను తన భర్తకు

ఎప్పుడూ సహకారంగా ఉంటానని, భార్యభర్తలు ఒకరికొకరు సహకారంగా ఉన్నప్పుడు ఆ కుటుంబానికి సమాజంలో గౌరవం ఉంటుందని అన్నారు. ప్రతీ మహిళ సమాజంలో ధైర్యంగా ముందుకెళ్ళి తమలోఉన్న ప్రతిభను ప్రదర్శించాలన్నారు. నేటి సమాజ పరిస్థితుల్లో అనేక మంది మహిళలపై వస్తున్న బ్యాడ్ కామెంట్స్ బాధ కలిగిస్తుందని అన్నారు. అందరూ ఒకలా ఉండరని, అందరినీ ఒకేలా చూడటం మంచి సంప్రదాయంకాదని అన్నారు. మహిళలందరూ ఉన్నతంగా చదవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. తాను 10వ తరగతి వరకే చదివానని, 16 ఏళ్ళకే వివాహం అయ్యిందని, దీనివల్ల చదువుకోవాలని ఉన్నా చదువుకోలేక పోయానని వివరించారు. తన పిల్లలను ఉన్నతంగా చదివించాలనేది తన కోరికని అన్నారు. మహిళలు ఆర్థికంగా స్థిరపడాలంటే విద్య ప్రధానంగా ఉండాలన్నారు. నిజాయితీగా ముందుకు వెళ్ళే మహిళలు భయపడాల్సిన అవసరంలేదన్నారు. ఆలీ జరగబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తారా అని ప్రశ్నించగా చిరునవ్వుతో సమాధానాన్ని దాటవేశారు. తనకున్న వ్యవసాయ క్షేత్రంలో కొంత సమయం ఈమె హుషారుగా గడిపారు.

నిలబడిన విద్యుత్ స్తంభాలు

- విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర - పెనుమంట్ర: మార్టేరు సబ్ స్టేషన్ పరిధిలో 14వ వార్డులో మార్టేరు నుండి శేషమ్మ చెరువుగ్రామం వెళ్లే ప్రధాన మార్గం పొడవున విద్యుత్ స్తంభాలు వాలి అత్యంత ప్రమాదంగా మారిన విద్యుత్ స్తంభాలను సోమవారం సిబ్బంది సరి చేశారు. పూర్తిగా

పడిపోతేనే గాని పట్టించుకోరా..? శీర్షికను విశాలాంధ్ర పత్రికలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనిపై సంబంధిత శాఖ మండల అధికారి బాపూజీ స్పందించారు. వాలిన విద్యుత్ స్తంభాలను తాళ్లు, ట్రాక్టర్ సహాయంతో సిబ్బంది నిలబెట్టారు. విద్యుత్ శాఖ ఉన్నత అధికారులు స్పందించి తక్షణమే ఈ సమస్యను పరిష్కరించడం పై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

7000 జనాభా ఉన్నచోట డిజిటల్ అసిస్టెంట్ లేకపోతే ఎలా..?

విశాలాంధ్ర-పెనుమంట్ర: సుమారు 7వేలు జనాభా కల్గిన పొలమూరు పంచాయతీ పరిధిలోని రెండు సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్స్ పోస్టులు ఖాళీగా ఉండ టంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రని పంచాయతీ వార్డు సభ్యుడు, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు

తోరం వెంకన్నబాబు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్స్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ పెనుమంట్రలో జరిగిన స్పందన కార్యక్రమంలో సోమవారం ఫిర్యాదు చేశారు.

పారిశుధ్య కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలి

విశాలాంధ్ర-పెంటపాడు: పెంటపాడు మండలం పెంటపాడు గ్రామంలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న బుంగ సూరిబాబు, ఆవిడ గంగరాజులు మెయిన్ డ్రైనేజీ పనిచేస్తుండగా కల్వర్టు గోడ కూలి కార్మికుల పై పడింది. వెంటనే పైన ఉన్న సిబ్బంది కింద ఉన్న గంగరాజును సూరిబాబును కష్టతరంగా

తీశారు. వారికి బలమైన గాయాలవడంతో మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్ ద్వారా పెంటపాడు నుండి తాడేపల్లిగూడెం ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం హాస్పిటల్లో డాక్టర్ల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర కోశాధికారి తాడికొండ వాసు, పెంటపాడు పంచాయతీ వర్కర్స్ యూని యన్ నాయకులు కే లక్ష్మణ్ చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. వీరితోపాటు పెంటపాడు ఉప సర్పంచ్ కొవ్వూరు ప్రసాద్ రెడ్డి, గ్రంథాలయ ఛైర్మన్ కర్రీవరహాల, రెడ్డి, వైసిపి నాయకులు తాడేపల్లి ఈశ్వరరావు, పంచాయతీ గుమస్తా శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నేడు సిపిఐ బహిరంగ సభ జయప్రదం చేయండి

- సిపిఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర-తణుకు: సిపిఐ బస్సు యాత్రలో భాగంగా మంగళవారం తణుకు మున్సిపల్ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం జరిగే బహిరంగ సభ జయప్రదం చేయాలని సిపిఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. సోమవారం

తణుకులో కార్మిక సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో ఈనెల 17వ తేదీన విశాఖ ఉక్కు పరిశ్రమ వద్ద సిపిఐ బస్సు యాత్ర ప్రారంభమైందని నేడు పశ్చిమగోదావరి జిల్లాలో బస్సు యాత్ర ప్రవేశిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ బహిరంగ సభలో జిల్లా సమగ్ర అభివృద్ధికి సంబంధించిన అనేక అంశాలు ప్రస్తావిస్తారని తెలిపారు. ఈ బహిరంగ సభలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ,సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.మధు తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ బహిరంగ సభలో సిపిఐ శ్రేణులు, ప్రజా సంఘాలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు తుమ్మలపల్లి శ్రీనివాస్, దేవ పెద్దిరాజు, తోట నాగేశ్వరరావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బస్సుయాత్ర విజయవంతం చేయండి

విశాలాంధ్ర-నూజివీడు : ఈ నెల 24వ తేదీన నూజివీడులో నిర్వహించనున్న సిపిఐ బస్సుయాత్రను, భూ సదస్సును జయప్రదం చేయాలని సిపిఐ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, నియోజకవర్గ కార్య

దర్శి బత్తుల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్రపార్టీ నేతృత్వంలో ఈ నెల 17న విశాఖలో ప్రారంభమైన బస్సుయాత్ర 24వ తేదీ నూజివీడుకు చేరుకుంటున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని జయప్రదం కోరుతూ చేపట్టిన ప్రచార ఆటోను సోమవారం మండలంలోని పోతురెడ్డిపల్లి నుండి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొమ్మన మాట్లాడుతూ బస్సుయాత్రలో భాగంగా నియోజకవర్గంలో నెలకొని వున్న బంజరుభూముల సమస్యలపై అటవీ బంజరు సాగుదారులతో 24 వ తేదీన భూసదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ భూ సదస్సులో సిపిఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణతో పాటు వామపక్ష పార్టీల నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

సిపిఐ బస్సు యాత్ర గోడపత్రిక విడుదల

విశాలాంధ్ర-చింతలపూడి: రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఐ ప్రచార జాత బస్సు యాత్ర ఈనెల 23వ తేదీన జంగారెడ్డిగూడెం చేరుకుంటుందని , అనంతరం నిర్వహించే

బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య పిలుపునిచ్చారు. సోమవారం సిపిఐ కార్యాలయంలో బస్సు యాత్ర గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను విరమించుకుని ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, సొంత గనులు కేటాయించాలని, భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు ప్రతిపాదిత ఎత్తుతో నీటి నిల్వలతో నిర్మించాలన్నారు. ముందుగా నిర్వాసితులకు పరిహారం చెల్లించి పనులు ప్రారంభించాలన్నారు. అమరావతిని రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. బహిరంగ సభకు చింతలపూడి మండలం నుంచి 50 మోటార్ సైకిల్ ర్యాలీతో వందమంది కార్యకర్తలు హాజరవుతున్నారని తెలిపారు. ఈ ఆవిష్కరణలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు, మండల కమిటీ సభ్యులు దొంత కృష్ణ, రైతు సంఘం నాయకులు తాడిగడప మాణిక్యాలరావు, తదితరులు ఉన్నారు.

తణుకులో సిపిఐ బస్సు యాత్ర జయప్రదం చేయండి

విశాలాంధ్ర -భీమవరం: మతోన్మాదం నుండి దేశాన్ని రక్షించాలని, పెరుగుతున్న ధరలను తగ్గించాలని కోరుతూ, ప్రజలపై భారాలు మోపుతూ ఇబ్బందులు పెడుతున్న పాలకుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా మంగళవారం తణుకులో జరుగుతున్న సిపిఐ బస్సుయాత్ర, బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ రూరల్ మండల కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన భీమవరంలో మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో రైతుల ఆకలి కేకలు పాలకులకు వినిపించడం లేదని అన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ, వైసీపీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరుతూ జరిగే సిపిఐ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. బహిరంగ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు పాల్గొంటున్నారని ఆయన తెలిపారు

సీపీఐ బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-తణుకు: రాష్ట్రాన్ని రక్షించండి, దేశాన్ని కాపాడండి అని కోరుతూ సీపీఐ ప్రారంభించిన బస్సు యాత్రకు మంగళవారం తణుకులో ఘనస్వాగతం పలకడానికి అన్ని ఏర్పాట్లు

పూర్తి చేసినట్లు సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఏరియా కన్వీనర్ టి.అప్పలస్వామి చెప్పారు. పట్టణంలో పలు సెంటర్లలో తోరణాలు, జెండాలు, బేనర్లతో ఆకర్షణీయంగా అలంకరణలు చేశారు. బహిరంగ సభ జరుగుతున్న మున్సిపల్ ఆఫీసు రోడ్డు అంబేద్కర్ విగ్రహం వద్ద సుందరంగా అలంకరించారు.తణుకు పట్టణంలో సీపీఐ బస్సుయాత్ర బహిరంగ సభ విజయవంతానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్టు నాగరాజు, అప్పలస్వామి చెప్పారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

విశాలాంధ్ర-భీమవరం: ప్రజా సమస్యల పరిష్కారార్థం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమం ద్వారా అర్జీదారులకు సత్వర పరిష్కారాన్ని అందించాలని అన్ని శాఖల

అధికారులను కలెక్టరేట్ పరిపాలన అధికారి అప్పారావు కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన దరఖాస్తుదారుల నుండి కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి అప్పారావుతో పాటు డిఎస్‌పి డి.శ్రీనాథ్, డిఆర్డిఏ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా మత్స్య శాఖ అధికారి ఆర్ వి ఎస్ ప్రసాద్ అర్జీలను స్వీకరించారు. సోమవారం నిర్వహించిన స్పందన ద్వారా 162 ఫిర్యాదులను స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వివాదాలకు తావు లేకుండా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలి

- జాయింట్ కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి

విశాలాంధ్ర - భీమవరం: జిల్లాలోని 1,454 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటర్ల జాబితా స్వచ్చీకరణ వేగవంతంగా జరుగుతున్నదని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో

జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి ఓటర్ల జాబితా స్వచ్చీకరణ పై భీమవరం, ఉండి, ఆచంట నియోజకవర్గాల ఎఇఆర్ఓ లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ మాట్లాడుతూ గత సంవత్సరం జూలై 1 నుండి మార్చి 31,2023 వరకు, ఎప్రిల్ 1నుండి ఈనెల 21 వరకు రెండు విడతల్లో ఓటర్ల జాబితా సవరణ జరిగిందన్నారు. ఈ జాబితాల నుండి పోలింగ్ స్టేషన్ల ఒక వెయ్యి మంది ఓటర్లను రాండమ్ చెక్ చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కోపరేటివ్ అధికారి రవికుమార్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఉయ్యాల అది శేషు, జిల్లా సర్వే అధికారీ జాషువా, ఎలక్షన్ సూపరింటెండెంట్ ఎల్.నరసింహా రావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత ప్రజలు ఫ్యామిటీ డాక్టర్ సేవలు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం సి.హెచ్. అగ్రహారం గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిప్పర పీహెచ్ సి వైద్యాధికారిణి డాక్టర్ కె. ప్రియాంక

మాట్లాడుతూ నెలలో మూడు సార్లు వైద్య సిబ్బంది 104 వాహనం ద్వారా వృద్ధులకు బి.పి, షుగర్ పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు అందించనున్నట్టు ఆమె తెలిపారు. గర్భిణీలకు పరీక్షలు నిర్వహించడం, మంచం మీద పడుకుని వున్న రోగుల ఇంటికి వెళ్ళి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని దీనిని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చుక్క అప్పారావు ఎంపీటీసీ పి.వి.నారాయణ,గ్రామ కార్యదర్శి స్రవంతి, హెచ్‌వి కరుణ కుమారి, ఆరోగ్య సహాయకుడు నామాల రాజు, ఆశ కార్యకర్తలు, గ్రామ వలంటీరు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : మండలంలో ఉన్న అన్ని గ్రామాల అభి వృద్ధికి కృషి చేస్తామని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గంజిమల రామారావు పేర్కొన్నారు. కొయ్యలగూడెం పట్టణంలో అశోక్ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీకి ఎంపీపీ గంజిమల

రామారావు, గ్రామపంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి కలిసి శంకుస్థాపన నిర్వహించి పనులు ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పోలవరం నియోజకవర్గ శాసనసభ్యులు తెల్లం బాలరాజు పట్టణంలోని అన్ని గృహాలను సందర్శించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారని, డ్రైనేజీ సమస్య రహదారుల సమస్య ఎక్కువ ఉన్నందున శాసనసభ్యులు నిధుల ద్వారా నూతన డ్రైనేజీ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంకు కొండలరావు, ఎంపీటీసీ సభ్యులు గంట శ్రీనివాసరావు, చింతా శ్రీదేవి, వార్డ్ మెంబర్లు పూలపల్లి రవికుమార్,సూది కొండల గణేష్, మండల కో ఆప్షన్ సభ్యులు ఎస్. కె.బాజీ, మారిశెట్టి శ్రీను,చిటికెన నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచశాంతి కోరుతూ ర్యాలీ

విశాలాంధ్ర - కలిదిండి: ప్రపంచ శాంతి కోరుతూ శాంతి ర్యాలీని మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వ హించారు. సోమవారం కలిదిండిలో కె.పి.ఎస్ స్కూల్ విద్యార్థులకు సర్పంచ్ మారుతి ప్రసన్న జెండా ఊపి ప్రారంభిం చారు. తహసీల్దార్ కార్యాలయం వరకు

విద్యార్థులు, ఉపాధ్యాయులు, మానవతా సేవా సంస్థ సభ్యులతో శాంతి ర్యాలీ చేసి సెంటర్లో మానవహారం నిర్వ హించారు. ఈ ర్యాలీలో జడ్పీటీసీ బొర్రా సత్యవతి, వైస్ ఎంపీపీ కట్టా నాగలక్ష్మి, పడమటిపాలెం సర్పంచ్ సానా మీనా సరస్వతి, స్కూల్ కరస్పాండెంట్ సానా రామారావు, కలిదిండి మానవతా సేవా సంస్థ చైర్మన్ పెటేటి వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థికంగా ఆదుకుంటున్న సీఎం

విశాలాంధ్ర -ముసునూరు: అక్కచెల్లెమ్మలకు ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలుపెట్టి ఆర్థికంగా ఆదుకుంటున్నారని నూజివీడు శాసనసభ్యులు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు.

సోమవారం మండలంలోని ముసునూరు హైస్కూల్‌లో 4వ విడత సున్న వడ్డీ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఏపిఎం కుంటం బాబు, ఎంపిడిఒ జి.రాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాల ద్వారా ఎన్నో సంక్షేమపథకాలు, ఎన్నో అభివృద్ధికార్యక్రమాలు చేస్తున్నారన్నారు. మండలంలోని 16 గ్రామాల్లోని 14,706 మంది మహిళలకు ,1470 గ్రూపులకుగాను రూ.1,98,74, 989లు చెక్కును డ్వాక్రా మహిళలకు అందచేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి పరికూటి ప్రతాప్,ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి,వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన,వైస్ ఎంపిపి-2 పాముల గంగధరరావు,వైసిపి మండల అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, డ్వాక్రామహిళలు, తదితరులు పాల్గొన్నారు.

యువత, మహిళలు రుణ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - ఏలూరు క్రైమ్: చదువుకుంటున్న యువత, మహిళలు ఆన్ లైన్, ఇనిస్టెంట్ లోన్, యాప్‌ల పట్ల ఆకర్షితులు అవ్వకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పి డి. మేరీ ప్రశాంతి అన్నారు.ఏలూరు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్ పి డి.మేరీ ప్రశాంతి స్పందన కార్యక్రమం నిర్వహించారు.ఫిర్యాదులన్నింటి పై సత్వరమే చట్ట ప్రకారం విచారణ చేసి ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాటలాడి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం జరిగిన స్పందనలో 45 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ చదువుకుంటున్న యువత, మహిళలు ఈ ఆన్‌లైన్ ఇనిస్టెంట్ లోన్ యాప్‌ల పట్ల ఆకర్షితులు కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనధికార లోన్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసేటప్పుడు కాంటాక్ట్, మీడియా, గ్యాలరీ కెమెరాలకు సంబంధించిన ఎటువంటి పర్మిషన్ ఇవ్వొద్దన్నారు. కేవలం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి గుర్తింపు పొందిన బ్యాంకులో నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల వద్ద వ్యక్తిగతంగా హాజరై మాత్రమే రుణాలు తీసుకోవడం మంచిదన్నారు.

'మానవత' మరిన్ని సేవాకార్యక్రమాలు నిర్వహించాలి

విశాలాంధ్ర - నిడమర్రు: మానవత సేవా సంస్థ ప్రజలకు అందిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని రాబోయే కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు(వాసు బాబు) అన్నారు. సోమవారం బువ్వనపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గణపవరం, నిడమర్రు మండలాల మానవత సేవా సంస్థ ప్రతినిధులు ఆయన కలిసి మంగళవారం జరిగే మానవత వ్యవస్థాపక దినోత్సవం కార్యక్రమానికి ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవత సేవా సంస్థ సేవ కార్యక్రమం చేయడానికి దాతల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ నాయకులు కాకర్ల వినాయక్, సంకు సత్య కుమార్, వంకాయల రామారావు, కంతేటి కృష్ణరాజు, వెల్లంకి నరేష్, నౌడు అచ్యుత రామారావు, పుప్పాల మెహర్ కుమార్, రెండు మండలాల నాయకులు పాల్గొన్నారు.

పడకేసిన గ్రామాల అభివృద్ధి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ అధికారం చేపట్టిన నాటినుండి అభివృద్ధి పడకేసిందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి విమర్శించారు. కొయ్యలగూడెంలో ఆమె నివాసం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సొంత పథకాలకు పంచాయతీ నిధులను వాడుకుంటున్నారని అన్నారు.. గ్రామ పంచాయతీలలో నిధులు లేకపోవడంతో గ్రామాల అభివృద్ధి కూడా కుంటుపడిందన్నారు. గ్రామాలలో కనీసం వీధిలైట్లు మరమ్మతులు చేయించలేని దుస్థితిలో రాష్ట్రం నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య సిబ్బందికి ఇవ్వాల్సిన జీతాలు వెంటనే చెల్లించాలని ఆమె తెలిపారు. గ్రామాలలో పారిశుధ్య పనులు కొరవడడంతో ప్రజలు తీవ్ర అనారోగ్యా లకు గురవుతున్నా రన్నారు. పారిశుధ్య కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో తెదేపా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతాం అని మేఘలాదేవి హెచ్చరించారు.

ప్రజల ముంగిట సేవలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : సచివాలయ భవనాలు, విలేజి క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు వంటి సౌకర్యాలతో ప్రజల ముంగిట సేవలు అందిస్తున్నామని శాసనసభ్యులు తెల్లం బాలరాజు అన్నారు. వంగపతి దేవి పేట గ్రామంలో సోమవారం ఎంపీటీసీ తేలే శ్రీనివాస్ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పాలనలో గ్రామీణ ప్రాంతాలు పురోభివృద్ధిలో పరిమళిస్తున్నాయన్నారు. ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజలలో మమేకమయ్యే విధంగా గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ప్రవేశపెట్టి ప్రజా సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటిని పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మండల పరిషత్తు నిధులనుండి మంగపతి దేవి పేట గ్రామంలో రూ.2 లక్షలతో తాగునీటి బోరు నిర్మాణం,రూ.1 లక్షతో తాగునీటి పైప్లైన్లు చేపట్టాలని సిసి డ్రైనేజీల నిర్మాణానికి రూ.3 లక్షలు విడుదల చేయాలని ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు తుమ్మలపల్లి గంగారాజు,ఏఎంసి ఉపాధ్యక్షులు తాడిగడప రామకృష్ణ,వైఎస్‌ఆర్సిపి మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, గ్రామపంచాయతీ సర్పంచ్ అబ్బు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

విశాలాంధ్ర- ముసునూరు: ముసునూరు మండలంలోని పలు గ్రామాల్లో ఇండ్ల స్థలాలు చూపకపోవడం రెవిన్యూ అధికారుల లోపమని మండల వైసిపి అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి, ఎంపిడిఒ జి.రాణి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపికోటగిరి రాజానాయన మాట్లాడుతూ జగనన్న ఇండ్ల స్థలాల్లో లేవుట్లు కు ఇంటి నిర్మాణాలకు కరెంట్,నీటి సదుపాయం కల్పిం చాలన్నారు. వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్ మాట్లాడుతూరైతులందరూ ఇకేవైసి చేయించుకోవా లన్నారు. జెడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్ మాట్లాడుతూ మండలకేంద్రమైన ముసునూరులో పశువుల డాక్టర్ లేదని, హాస్పటల్ కూడా శిథిలావస్థలో వుందన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో అక్రమ అటవీ పోరంబోకు భూములకు విద్యుత్ సప్లయి నిలిపివేయాలన్నారు. హౌసింగ్ ఏఇ బి.శివ మాట్లాడూతూ పియంజెవై ద్వారా 617గాను606 నిర్మాణం జరుగుతున్నాయన్నారు.లేఅవుట్లు మాత్రం1070 కి గాను,988 గుర్తించామన్నారు.

సంధ్యారాణి కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలి

విశాలాంధ్ర-ఆకివీడు : సంధ్యారాణిని అతి కిరాతకంగా హత్య చేసిన వాడపల్లి రాంబాబుని కఠినంగా శిక్షించాలని. ఆంధ్రప్రదేశ్ హ్యూమన్ రైట్స్ ప్రధాన కార్యదర్శి , ఏ.బీ.బి.ఎస్ ఉమెన్ సెల్ అధ్యక్షురాలు ఉచ్చుల సుజాత ఘాటుగా స్పందించారు. సోమవారం ఆకివీడు వచ్చినా ఆమె సంధ్యారాణి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఎస్సై ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంధ్య తల్లిదండ్రులకు రాంబాబు నుండి హాని ఉందని అందువలన దోషి కి యావజ్జీవ కారాగార శిక్ష విధించాలని, సంధ్య తల్లిదండ్రులకు అతని నుండి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు.

ఘనంగా వృద్ధుల జాతీయ దినోత్సవం

విశాలాంధ్ర-ఆకివీడు : వృద్ధుల సంక్షేమం కోసం పోలీసు వ్యవస్థ ఎప్పుడు నిబద్ధత పనిచేస్తుందని ఆకివీడు సిఐ కే వి వి ఎస్ సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆకివీడు లయన్స్ భవనంలోజాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా సర్ ఆర్థర్ కాటన్ సీనియర్ సిటిజన్ సంఘం , ఆకివీడు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన వృద్ధుల చట్టం 2007 పై అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం వి ఎస్ రాజు, వినియోగదారుల సంఘం అధ్యక్షులు, ఆకివీడు వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య మాట్లాడుతూ. యువతరానికి అర్థమయ్యేలాగా యువతకు అవగాహన సదస్సులు కల్పించి. యువతను సక్రమ మార్గంలో నడిపించే బాధ్యత ప్రతి సీనియర్ సిటిజన్ పై ఉందని అన్నారు. అనంతరం మంతెన వెంకట సూర్యనారాయణ రాజు సుభద్రయ్య చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో 100 మంది వృద్ధులకు దుప్పట్లు భోజనం ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ వి ఎస్ సూర్యనారాయణ రాజు, దాట్ల రామరాజు, మంతెన రవి వర్మ, గుర్రం శ్రీనివాస్, అడవి సుబ్బారావు, నేరెళ్ల రమణయ్య , నేరెళ్ల ఆదినారాయణ, పేర్ల ప్రసాద్, లైన్స్ క్లబ్ నెంబర్లు, వృద్ధులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

విశాలాంధ్ర- భీమవరం: ఇప్పటికే గృహ నిర్మాణాలు పూర్తయిన కాలనీల్లో మౌలిక వసతులను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్ జి.వి ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

సోమవారం స్థానిక విష్ణు కాలేజి మినీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశానికి చీఫ్ ఇంజనీర్ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల గృహ నిర్మాణాలను పూర్తి చేసుకున్నట్టు తెలిపారు. ఈ నెలాఖరునాటికి ముఖ్యమంత్రి చేతుల మీదగా ప్రారంభోత్సవాలకు శ్రీకారం చుట్టడం జరుగుతుంద న్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటికే పూర్తయిన 24,675 గృహాలలో మౌలిక వసతులను గృహప్రవేశాలు నాటికి పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి పీడీ ఎస్‌టివి రాజేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వెంకటరమణ, డిఈలు, ఏఈలు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను అశ్రద్ధ చేయవద్దు

విశాలాంధ్ర - పాలకొల్లు: జాతీయ వృద్ధుల దినోత్సవం పాలకొల్లు పట్టణ పరిధిలోని జివిఎస్ విఆర్ ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం రాయపూడి భవానీ ప్రసాద్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కేవిఎస్‌ఎల్ నరసింహరాజు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగరీత్యా విదేశాల్లో స్థిరపడి వృద్ధ తల్లిదండ్రులను అశ్రద్ధ చేయవద్దని సూచించారు. చివరి సమయంలో వృద్ధులను చక్కగా చూసుకోవాలని విద్యార్థులను కోరారు. ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్ తో విద్యుత్ బిల్లులు చెల్లించుకోవచ్చు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : నెలవారీ ఇచ్చే కరెంటు బిల్లు మీద ఉండే క్యూఆర్ కోడ్ తో వినియోగదారులు ఆన్ లైన్ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని విద్యుత్తు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ వెంకటేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు వినియోగ దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కరెంటు కనెక్షన్ కు సంబంధించిన ఏ అప్లికేషన్ అయినా గ్రామ వార్డు సచివాలయాల్లో మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన తెలిపారు. ప్రతి విద్యుత్ వినియోగదారుడు విద్యుత్ సర్వీస్ నెంబర్‌కు ఆధార్ లింక్ చేసుకోవాలని సూచించారు పూర్వీకుల యాజమానుల మీద ఉన్న విద్యుత్ కనెక్షన్లను ప్రస్తుత యజమాని పేరు మీద మార్చుకునేందుకు గ్రామ వార్డు సచివాలయంలో సంప్రదించాలని కోరారు వినియోగ దారులకు ఎటువంటి సందేహాలను 1912 కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలని కోరారు.

జీపిఎస్‌తో ఉద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: వైసీపీ అధికారం లోకి వచ్చిన వారం లోనే సిపిఎస్ రద్దు చేస్తానని చెప్పి నేడు సిపిఎస్ రద్దు చేయకుండా జీపిఎస్ అని కొత్త పథకం అమలు చేస్తున్నట్లు సీఎం ప్రకటించడం ఇచ్చిన మాట తప్పడమే అని సిపిఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు ఆర్. నాగ దుర్గారావు సోమవారం ఒక ప్రకట నలో పేర్కొన్నారు. జీపిఎస్ లోని విధి విధానాలు ఏమి చెప్పకుండానే డైరెక్ట్‌గా ఆర్డినెన్సు తెచ్చి ఉద్యోగులకు మంచి చేస్తున్నట్టు కబుర్లు చెబుతూ ఉద్యోగుల సిపిఎస్ ఖాతాలలో సొమ్ములు ప్రభుత్వం కాజేసే ప్రయత్నం చేస్తుందేమో అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.సిపిఎస్ రద్దు చేయకుండా ప్రభుత్వం పేరు మార్చి మంచి చేస్తున్నామని ఉద్యోగులను మోసం చేస్తున్నారని అన్నారు. ఉద్యోగుల మంచి కోరే వారే అయితే రాజస్థాన్,ఛత్తీసగఢ్ , జార?ండ్ , హిమాచల్ ప్రదేశ్,పంజాబ్ లాగా సీపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చెయ్యాలని దుర్గారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మెరుగైన సమాజం 'మానవత' లక్ష్యం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఉత్తమ సమాజ నిర్మాణమే మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆశయం అని సంస్థ అధ్యక్షులు బొమ్మ రామ్మోహన్ రావు పేర్కొన్నారు. కొయ్యలగూడెం పట్టణంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించి. గణపతి సెంటర్ వద్ద విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. అనంతరం కొయ్యలగూడెం ఎస్‌సి కాలనీకి చెందిన లాయర్ ముప్పిడి వెంకట్రావు గుండె ఆపరేషన్ చేయించుకుని అనారోగ్యానికి గురి కావడంతో ఇంటి వద్దనే ఉంటున్న వెంకట్రావుకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు రూ.3వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి స్వచ్ఛంద సేవా సంస్థల వారు ముందుకు రావాలని మానవత సంస్థ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిర్నతి సిద్ధార్థ, వి ఎస్ ఎన్ స్వామి,ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, నక్క బాబి, మందపాటి రామకృష్ణ, బవిరిశెట్టి నాగేశ్వరరావు, దిద్దె ఎబినేజర్ తదితరులు పాల్గొన్నారు.

డీలర్లు నిబంధనలు పాటించాలి:ఏవో జరీనా

విశాలాంధ్ర-మండవల్లి: ఎరువుల డీలర్లు నిబంధనలు మేరకే ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని మండల వ్యవసాయాధికారిణి షేక్‌జరీనా సూచించారు.మండలంలోని లింగాల గ్రామంలో ఎరువులు, పురుగుమందుల దుకాణంలో సోమవారం ఏవో తనిఖీలు నిర్వహించి నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం పంపారు. దుకాణాల్లో స్టాక్‌బోర్డులు ఏర్పాటు చేయాలని,లైసెన్సులు గడువు లోగా రెన్యువల్ చేసుకోవాలని,ఎంఆర్పి ధరలకే ఎరువులు విక్రయించాలని, ఈపాస్ యంత్రాల ద్వారానే అమ్మకాలు చేపట్టాలని నిబంధనలు పాటించనివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో పేర్కొన్నారు.

మట్టి ఖర్చులకు పదివేలు అందజేత

విశాలాంధ్ర-మండవల్లి: బిసి కాలనీకి చెందిన తానా వీర వెంకటేశ్వరావు సహజ మరణం చెందగా మట్టి ఖర్చుల నిమిత్తం పదివేల నగదును మండవల్లి సర్పంచ్ మెండా జాన్సీ,వార్డు సభ్యులు ఆగొల్లు సత్యనారాయణ, బోయిన వెంకటేశ్వరావులు మృతుని కుటుంబసభ్యులకు సోమవారం అందించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మెండా సురేష్‌లతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువగళంతో నూతన ఉత్సాహం



విశాలాంధ్ర-చాట్రాయి: యువ పాదయాత్ర యువకుల్లో నూతన ఉత్సాహం నింపుతుందని టిడిపి యువ నాయకులు చాగంటి రాధా కొనియాడారు. సోమవారం చాట్రాయి మండలం పోలవరం గ్రామానికి చెందిన చాగంటి రాధ పాధ యాత్ర 190వ రోజు 2525కిమీ పూర్తి అయిన సందర్భంగా లోకేష్ ను కలిసారు.అనంతరం ఆయన విశాలాంధ్ర తో మాట్లాడుతూ.40 ఏళ్ల తెలుగుదేశం పార్టీ రాజకీయ చరిత్రలో లోకేష్ పాదయాత్ర సరికొత్త చరిత్రను సృష్టిస్తుందని టిడిపి విజయం ఖాయమన్నారు.

మంచినీటి చెరువులకు నీళ్లు విడుదల చేయాలి

విశాలాంధ్ర-కలిదిండి: త్రాగునీటి చెరువులకు మంచి నీళ్లు విడుదల చేయాలని ఫిల్టర్ చేసిన మంచినీళు సరఫరా చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించి మండల పరిషత్ కార్యాలయం లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం కలిదిండి మండల కార్యదర్శి శేషపు. మహంకాళిరావు మాట్లాడుతూ వర్షాకాలం వచ్చి సుమారు రెండు నెలలు అయినప్పటికీ ఇప్పటికీ మండలంలోని మంచినీటి చెరువులలో వేసవి కాలానికి ముందు నింపిన నీళ్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. చెరువులలో నీళ్లు అడగంటిపోవడంతో బురద మయంగా మారి దుర్వాసన వస్తున్నాయని వాడుకోవడానికి కూడా ఇబ్బందికరంగా ఉన్నాయని అన్నారు. భాస్కరరావు పేట, మూలలంక, పెద్ద లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులు వెంటనే స్పందించి నీళ్ల విడుదల చేసి మంచినీటి చెరువుల నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు అర్థాని. వెంకటేశ్వరరావు. గంటా. రఘురాం ప్రసాద్, కుడుపూడి శ్రీనివాస రావు, దొంగ వెంకట సత్యనారాయణ, వీరవల్లి. వరలక్ష్మి, పెరుమాళ్ళ. సత్యనారాయణ,చిన్నం. శ్రీకాంత్, పరసా. రాజేష్, గూట్ల. జయరాజు, బత్తిన. రఘు, గద్దె. అనిల్ కుమార్, కట్టా. గాంధీ తదితరులు పాల్గొన్నారు.

న్యూఢిల్లీలో 24న జరిగే రైతు సదస్సును జయప్రదం చేయండి

విశాలాంధ్ర -భీమవరం: న్యూ ఢిల్లీలో ఈ నెల 24వ తేదీన రైతు సంఘాల సమాఖ్య సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జరిగే రైతు సదస్సును జయప్రదం చేయాలని అఖిల భారత అగ్రగామి కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షులు లంక కృష్ణమూర్తి మూర్తి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన భీమవరంలో మీడియాతో మాట్లాడుతూ ఈ సదస్సుకు దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల నుంచి రైతు సంఘం ప్రతినిధులు హాజరవుతా రన్నారు.ఢిల్లీలో గత సంవత్సరం లక్షలాది మంది రైతులు రైతు సమస్యల మీద చేసిన స్ఫూర్తిదాయకమన్నారు. వీరోచిత పోరాటం చేశారు ఆ పోరాటంలో మంది సుమారుగా రైతులు చనిపోయారు. స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని , విద్యుత్ సంస్కరణ బిల్లులు, ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలని, వ్యవసాయ రుణాలను రద్దు చేయాలని ఇలా ఎన్నో సమస్యలపై జరిగిన పోరాటంలో 150 రైతులు అమరులయ్యారని ఆయన గుర్తుచేశారు. నాడు రైతాంగానికి మోడీ క్షమాపణలు నల్ల సాగు చట్టాలను రద్దు చేస్తానని హామీ ఇచ్చి మాట చెప్పాడని లంక విమర్శించారు. ఈ నేపథ్యంలో 24న ఢిల్లీలో జరిగే రైతు సంఘాల సదస్సును జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తాడేపల్లిగూడెం-తణుకు నియోజకవర్గాల సమీక్ష సమావేశం జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పెంటపాడు : మంగళవారం పెంటపాడు కూనాకరిపేటలో తాడేపల్లి గూడెం, తణుకు నియోజకవర్గాల ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ ఎఫ్ ఎం ఎస్ పి మహిళా సంఘం సమీక్ష సమావేశం జయప్రదం చేయాలని మహాజన సోషలిస్టు అధికార ప్రతినిధి విస్సంపల్లి సిద్దు మాదిగ తెలిపారు. సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం మాండ్రు అశోక్ మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న సిద్దు మాదిగ మాట్లాడుతూ త్వరలో లక్షలాదిమందితో హైదరాబాదులో ఎస్సీ వర్గీకరణ లక్ష్యసాధన కోసం మాదిగ జాతికి మేలు చేసే విధంగా పార్లమెంటులో చట్టం చేసే విధంగా మాదిగ జాతి చావో రేవో తేల్చుకునే విధంగా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.క ఈ కార్యక్రమంలో ఎం ఎస్ పి జిల్లా ఉపాధ్యక్షులు దూలపల్లి శ్రీనివాసరావు మాదిగ, ఎమ్మెస్పీ నాయకులు,వాసు,చౌదరి,రవి, చిన్ని,శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

మిథున్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే గ్రంధి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : వైసీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సోమవారం తణుకులో కలుసుకున్నారు. తణుకులో జరుగుతున్న సేవాదళ్ సమావేశానికి హాజరైన మిథున్ రెడ్డిని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కలిసి ప్రస్తుతం భీమవరం నియోజకవర్గంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. పెండింగ్‌లో ఉన్న పనులకు సంబంధించి వెంటనే నిధులు మంజూరు చేయించాలని కోరారు.

అంగన్వాడీ పోస్ట్ భర్తీకి నోటిఫికేషన్ విడుదల

విశాలాంధ్ర - ఆలమూరు : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కొనసీమ జిల్లా కొత్తపేట ఐసిడియస్ ప్రాజెక్ట్ పరిధిలో గల ఆలమూరు మండలం పెద్దపళ్ల గ్రామంలో ఖాళీగా ఉన్న 01 అంగన్వాడీ కార్యకర్త పోస్టు భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కొత్తపేట ఐసిడిఎస్ సిడిపిఓ పి శారద తెలిపారు. అంగన్వాడి కార్యకర్త ఒక పోస్టుకుగాను పెదపళ్లి-3 (ఓసి జనరల్) ఏరియాకి సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలియజేశారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు స్థానిక వివాహితులై పదవ తరగతి ఉత్తీర్ణత చెంది ఉండాలన్నారు. 01 జులై 2023వ తేదీ నాటికి 21వ సంవత్సరం నిండి 35 సంవత్సరాలు లోపు ఉండాలని, దరఖాస్తుతో పాటు విద్యార్హత, స్థానిక, కుల ధ్రువీకరణపత్రం, పుట్టిన తేదీ, ఆధార్ కార్డు నకళ్ళను జత చేసి పూర్తి చేసిన దరఖాస్తును కొత్తపేట ఐసిడిఎస్ కార్యాలయం పనివేళల్లో ఈనెల 31వ తేదీ లోపు అందజేయాలని, దరఖాస్తుదారులకు సెలక్షన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూ నిర్వహించబడనని ఆమె తెలిపారు. కాళీ దరఖాస్తుల పత్రాలు కొత్తపేట ఐసిడిఎస్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని కావలసిన అభ్యర్థులు ఉదయం 10 గంటల నుండి 5 గంటలు లోపు కార్యాలయం పనిచేసే రోజుల్లో పొందవచ్చునని, మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సిడిపిఓ పి శారద తెలిపారు.

ఓటర్ల జాబితా వివరాలు ఆన్ లైన్‌లో పొందుపరచాలి

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర - భీమవరం : నేటి వరకు ఇంటింట ఓటర్ల జాబితా పరిశీలనకు సంబంధించిన వివరములను ఆన్లైన్ లో పొందుపరచాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు.సోమవారం స్థానిక వీడియో

కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి జిల్లా జాయింట్ కలెక్టర్ తో కలిసి జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ ఓ లు, బి ఎల్ వోలు, సూపర్వైజర్లతో ఇంటింట ఓటర్ల జాబితా పరిశీల పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సోమవారం వరకు నిర్వహించిన ఓటర్ల సర్వే వివరాలను వెంటనే ఆన్ లైన్ లో తప్పనిసరిగా నమోదు చేయాలని సంబంధిత అధికారును ఆదేశించారు. డోర్ టు డోర్ సర్వేలో సేకరించిన ఫారం 6,7,8 లను అనుసరించి కొత్తగా చేర్చిన ఓటరు వివరాలు, మార్పులు సవరణ ఏరోజుకు ఆరోజు సరిచూసుకోవాలన్నారు. అలసత్వంవహిస్తే చర్యలు తప్పవని ఆమె అన్నారు.ఈ సర్వే కి సంబంధించి జిల్లాలో అందరూ బాగా చేస్తున్నారనీ ఈ సందర్భంగా నూటికి నూరు శాతం సర్వే పూర్తి చేసిన వారిని ఆమె ప్రత్యేకంగా అభినందించారు.ఇప్పటికే 90 శాతం పూర్తయిందని నేటితో నూరు శాతం పూర్తి చేసి రేపటినుండి ఆన్లైన్ చేయడం వేగవంతం కావాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి సంబంధిత శాఖ అధికారులు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి, కలెక్టరేట్ ఎలక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిఎస్పీ మండల సెక్టార్ బూత్ కమిటీలు నిర్మించండి

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బహుజన సమాజ్ పార్టీ కార్యవర్గ సమావేశం, ఆదివారం అమలాపురం వెంకటేశ్వర ప్లాజాలో జరిగింది. జిల్లా అధ్యక్షులు సత్య చింతా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా కోలా త్రిమూర్తులును ప్రకటించటం జరిగింది. జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో నియోజకవర్గ కమిటీలు, మండల కమిటీలు, సెక్టార్ కమిటీలు, బూత్ కమిటీలు వేసుకొని పార్టీనీ రాబోవు ఎన్నిలకు సిద్ధం చేయాలని తీర్మానించుకోవటం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ఇన్చార్జులు కాండ్రేగుల నరసింహం, కాశి లక్ష్మీ భవాని, జిల్లా ఉపాధ్యక్షులు వాకపల్లి భీమారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుమ వెంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి సాకా రాజారావు, నియోజకవర్గాల అధ్యక్షులు పెండెం శ్రీనివాస్, బడుగు భీమేశ్వరరావు, తాడి రాంబాబు, జి కొత్తియ్య, ఆకుమర్తి భూషణం, కన్వీనర్లు కమిడి శ్రీను, పి శ్రీను, బుడితి దయా మహేశ్వరరావు, బీర మహేష్, మోకా శ్రీను జెఎస్ డి రాజు, నాగవరపు ఏడుకొండలు, కాండ్రేగుల గంగరాజు, అనిపే రవి, తదితరులు పాల్గొన్నారు.

కన్నులందువగా కుంకుమార్చన

విశాలాంధ్ర - రాజానగరం : ప్రజలు శ్రేయస్సు కోసం నాగ పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన రాజానగరంలో సోమవారం తలపెట్టిన దశ సహస్ర సువాసినీ స్వహస్తేతి కోటి కుంకుమార్చన పూజా కార్యక్రమాలు కన్నులపండువగా జరిగాయి. దీనిలో భాగంగా నియోజకవర్గ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు రాజానగరం సూర్యారావు పేట హైవే నందు ఉన్న శ్రీ కనక దుర్గమ్మ ఆలయం,స్థానిక రామయలం,శ్రీ ముత్యాలమ్మ ఆలయం, శ్రీ గోగులమ్మ ఆలయం,శ్రీ నుకాలమ్మా ఆలయం తదితర ఆలయాల్లో జక్కంపూడి దంపతులు స్వయంగా ప్రత్యేక పూజల్లో పాల్గొనీ అమ్మవారికి కుంకుమ పూజులు నిర్వహించారు.కుంకుమ అర్చనలో పాల్గొనేందుకు మహిళలు పెద్ద ఎత్తున పల్గునడంతో ప్రతి దేవాలయం మహిళలు, బక్తులతో కిటకిటలాడాయి.దీనిలో భాగంగా జక్కంపూడి రాజా సతీమణి రాజశ్రీ పూజలకు హాజరైన మహిళలకు చీర పసుపు కుంకుమలను కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ సర్వజన హితం, రాష్ట్రాభివృద్ధి మరియు గ్రామాభివృద్ధియే సంకల్పమే ధ్యేయంగా రాజానగరం నియోజకవర్గ వ్యాప్తంగా 110 దేవాలయాలలో దశ సహస్ర సువాసినీ స్వహస్తేతి కోటి కుంకుమార్చన పూజా కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. అలాగే వైసీపీ సిజిసి సభ్యులు జక్కంపూడి విజయలక్ష్మి పలు దేవాలయాలు సందర్శించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌ఎస్ డెవలపర్స్ అధినేత దూలం చిన్న, పార్టీ మండల కన్వీనర్ దూలం పెద్ద,గ్రామ సర్పంచ్ కుందేటి ప్రసాద్,ఉప సర్పంచ్ కొల్లి వీరాజు, నాయకులు కాము,ప్రగడ చక్రి,వాడ్రేవు శ్రీనివాస్, ఆకుల శ్రీను,పిడుగు శ్రీను,సంగీత ప్రసాద్,నీలపాల శివరామకృష్ణ,నాగ త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో దరఖాస్తుదారులకు ఉద్యోగాలు

విశాలాంధ్ర - కాకినాడ : కలెక్టరేట్లో జరిగే "స్పందన" కార్యక్రమంలో ఇటీవల దరఖాస్తు చేసుకున్న 11మంది అభ్యర్థులు "వికాస" ద్వారా భీమా జూవెల్స్ సంస్థలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరు సోమవారం "స్పందన" హాలులో కలెక్టర్ కృతికా శుక్లాని మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్చాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. షేక్ లాల్షాహిద్ సీనియర్ సేల్స్ ఎగ్జిక్యూటివ్గా నెలకు సుమారు రూ.27,500 జీతంతో ఎంపికయ్యారు. కె వంశీకృష్ణ సీనియర్ క్యాషియర్గా రూ.25,000 జీతంతోను, వి దుర్గారావు రూ.24,000 టి వీరభద్రా 21,000, సేల్స్ ఎగ్జిక్యూటివ్గా రూ.24,000 జీతంతోను, జి సత్యసాయి రూ.20,000 పిజె రాజు 19,000, బి శరత్ చంద్ర వరప్రసాద్ 17,000 ఆర్ హనుమ నాయక్, ఎ. సూర్య భగవాన్లు రూ.14,000 జీతంతో సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఒ.రాజ్కుమార్ డిపార్ట్మెంట్ మేనేజర్ 17,500, పి దివ్య కస్టమర్ రిలేషన్షిప్ ఎగ్జిక్యూటివ్గా నెలకు రూ.20,000 జీతంతో ఎంపికయ్యారు. వీరికి ఉచిత భోజనం, వసతి సదుపాయం ఉంటుంది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఇలక్కియగారు, డిఆర్ఒ కె శ్రీధర్రెడ్డి, వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. లచ్చారావు పాల్గొన్నారు.

మానవతా ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి ర్యాలీ

విశాలాంధ్ర - ఉండి : ప్రజలందరూ శాంతి మార్గంలో పయనిస్తూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలవాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా సభ్యులు రుద్రరాజు సూర్యనారాయణరాజు అన్నారు. సోమవారం ఉండి మెయిన్ సెంటర్ లో మానవత మండల అధ్యక్షులు కట్రెడ్డి తాండవ నాగ సత్యనారాయణ అధ్యక్షతన దివ్య జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులచే ప్రపంచ శాంతి ర్యాలీ నిర్వహించి ఉండి పెద్ద వంతెన సెంటర్లో సోమవారం మానవహారాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రుద్రరాజు సూర్యనారాయణ రాజు, మాజీ అధ్యక్షులు దంగేటి రామలింగేశ్వర రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు శాంతి మార్గంలో పయనిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. మానవతా ఉండి కన్వీనర్ కొమ్మన నాగబాబు మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ మానవతా ఆవిర్భావం దినోత్సవం పురస్కరించుకుని గత ఐదు సంవత్సరాల నుండి వారోత్సవాలు నిర్వహిస్తూ ప్రపంచ శాంతి ర్యాలీ చేయడం జరుగుతుందని గత ఐదు సంవత్సరాల్లో 500 శాఖలకు పైగా విస్తరించిన మానవతా ఇతర స్వచ్ఛంద సేవా సంస్థలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. మండలంలో తొమ్మిది ఫ్రీజర్ లను ఏర్పాటు చేయడం జరిగిందని కావాల్సిన వారు వీటిని వినియోగించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పి ఆర్ కె రాజు, కూనపరాజు వెంకటరామరాజు, దివ్య జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.